క్లుప్తంగా

పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత


సౌండ్‌సిస్టం అందజేస్తున్న జీఎంఆర్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని సాజుతండా ప్రాథమిక పాఠశాలకు మంగళవారం జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సౌండ్ సిస్టం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుతో పాటు సమావేశం నిర్వహించుకునేందుకు ఉపయోగపడేందుకు సౌండ్ సిస్టం అందించినట్లు కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులకు పలకలు, స్టేషనరీ అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఓ చరణ్, చైర్మన్ మంజుల, ప్రధానోపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయురాలు లావణ్య, అంగన్‌వాడీ టీచర్ సుచల, వాలంటీర్ పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటల పరిశీలన


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి హరిప్రసాద్

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేట గ్రామంలో మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ మంగళవారం పరిశీలించారు. అయితే కొంత మంది రైతులు మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేసిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారని, అందుకే పంటలను పరిశీలించినట్లు ఏఓ తెలిపారు. పంటకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. అనంతరం అధికారుల ఆదేశాల మేరకు విత్తనపరిశ్రమ నుంచి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఏఓ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం

జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం

రామాయంపేట(మెదక్): సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం ఆదేశించారు. మంగళవారం మండలంలోని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ప్రతి రోజూ ఎంతమంది రోగులు వస్తున్నారనే విషయాలను డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ హరిప్రియ, ఇతర సిబ్బంది ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

మనోహరాబాద్(తూప్రాన్): ఎస్పీ ఆదేశాల మేరకు మనోహరాబాద్ రైల్వే స్టేషన్‌లో భద్రతా చర్యల్లో భాగంగా బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో ఏఎస్‌ఐ రాంబాబు ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో జాగ్రత్తగా పరిశీలించినట్లు తెలిపారు.
చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో మంగళవారం బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించింది.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

డీఎస్పీ నరేందర్‌గౌడ్

తూప్రాన్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీఎస్పీ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వాహనాలపై నమోదైన జరిమానాలను వెంటనే చెల్లించాలని సూచించారు. ఈ తనిఖీల్లో సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐలు శివానందం, యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

నర్సాపూర్: విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ పలు ప్రభుత్వ వసతిగృహాలు శిథిలావస్థలో ఉన్నా యని, విద్యార్థులకు మౌలిక వసతులు లేవన్నారు. కేజీబీవీ, గురుకులాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెను అమలు కావడం లేదని చెప్పారు. జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు అందక పేద విద్యార్థులు అనేక ఆర్థిక పరమైన ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు అర్జున్, అభిలాష్, విఘ్నేష్, నాగరాజు పాల్గొన్నారు.

ముమ్మరంగా కార్డెన్‌సెర్చ్

- 150 వాహనాల సీజ్ చేశాం
- అనుమానితులు కనిపిస్తే సమాచారం అందించాలి
- డీఎస్పీ ప్రసన్నకుమార్


కార్డెన్ సెర్చ్‌లో సీజ్ చేసిన వాహనాలు

మెదక్ మున్సిపాలిటీ: నేర నియంత్రణలో భాగంగా కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని, అనుమానిత వ్యక్తుల సమాచారం తెలిస్తే సమీప పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పట్టణ శివారులోని పిల్లికోటాల్ డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ మేరకు దాదాపు 500 డబుల్ బెడ్రూం ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 134 మోటర్ సైకిల్స్, 13 ఆటోలు, 2 కార్లు, ఒక ట్రాలీ వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఇద్దరు సీఐలు, 8 ఎస్‌ఐలు, 97 మంది సిబ్బందితో కలిపి దాదాపు 108 మందితో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా కమ్యూనిటీ కాంటాక్టు లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కార్డెన్‌సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కాలనీల్లో, ఇంటి ప్రదేశాల్లో అనుమానితంగా ఎవరైనా కనబడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. అయితే కొత్తగా రెంట్ కోసం వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకొని ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఆర్‌ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత.. రైతుల ఆందోళన



తూప్రాన్‌లో యూరియా కోసం దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

తూప్రాన్: యూరియా కోసం రైతులు దుకాణం ఎదుట ఆందోళనకు దిగారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. పంట ఎదుగుదలకు ఎరువులు వేయాల్సిన సమయంలో యూరియా కొరత ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాల ప్రకారం.. పట్టణంలోని నటరాజ్ ట్రేడర్స్ ఎరువుల దుకాణానికి యూరియా వచ్చిందని తెలియడంతో రైతులు మంగళవారం ఉదయం 8గంటల నుంచే క్యూ కట్టారు. ప్రతి రైతుకు రెండు బస్తాల చొప్పున వ్యవసాయాధికారుల సమక్షంలో పంపిణీ చేపట్టారు. అయితే సాయంత్రం 6గంటలకు దుకాణం మూసివేయడంతో అప్పటికే యూరియా కోసం వేచి ఉన్న రైతులు ఇబ్బందులు పడ్డారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకే దుకాణం మూసివేశారని రైతులు ఆరోపించారు. ఆ తర్వాత దుకాణం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. ఉదయం యూరియా పంపిణీ చేస్తామని తెలపడంతో రైతులు తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. అయితే దుకాణానికి ఉదయం 1,889 బస్తాలు యూరియా వచ్చిందని, ఇందులో 240 బస్తాలు రైతులకు విక్రయించినట్లు మండల వ్యవసాయాధికారి గంగుమల్లు తెలిపారు. ఇంకా దుకాణంలో 1,600 బస్తాలు యూరియా అందుబాటులో ఉందన్నారు. బుధవారం ఉదయం నుంచి పంపిణీ చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

వ్యవసాయ శిక్షణకు విద్యార్థుల ఎంపిక


శిక్షణకు ఎంపికైన విద్యార్థులతో విజ్ఞానజ్యోతి, ఇతర కంపెనీ ప్రతినిధులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఉచిత వ్యవసాయ విద్యలో శిక్షణకు ఎంపికైన విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞాన జ్యోతి విద్యాసంస్థ అడ్వైజరీ కమిటీ చైర్మన్ అచ్యుత రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ రామానాయకుడు విజ్ఞానజ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యాసంస్థ, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో నూజివీడు సీడ్స్, హెచ్‌ఎం క్లాస్ సీడ్స్ ఆధ్వర్యంలో 6 నెలల ఉచిత వ్యవసాయ విద్యను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ అభివృద్ధికి విజ్ఞాన జ్యోతి తమవంతుగా కృషి చేస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వ్యవసాయ విద్యతోపాటు భోజనం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. వ్యవసాయంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, చీడ పీడల నివారణ, అధిక దిగుబడులు సాధించే విధంగా క్షేత్రస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నూజివీడు సీడ్స్ మేనేజర్ శ్రీనివాసరావ్, హెచ్‌ఎం క్లాస్ ఏసియా ఎన్విరాన్‌మెంట్ అండ్ హెచ్‌ఎం క్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్‌ఆర్ మేనేజర్ మౌచూమి కాన్వర్ గొగాయి, విజ్ఞాన జ్యోతి డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం


పుస్తకాల గురించి వివరిస్తున్న సిబ్బంది గణేష్

హవేళీఘణాపూర్(మెదక్): మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలలో జాతీయ లైబ్రేరియన్ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ సృజన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సంతోష్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు మహనీయుల చరిత్ర, స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుల గురించి చదువుకొని జ్ఞానం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏటీపీ సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్టీ గురుకులంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఫణికుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కొండల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ మంజుల, సునంద, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి తొట్టి నిర్మించాలని వినతి

నర్సాపూర్: మండలంలోని 7వ వార్డులో కూల్చిన పశువుల నీటి తొట్టిని పునఃనిర్మించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయీం, మాజీ కౌన్సిలర్ సురేష్‌లు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాంచరణ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో గ్రామ పంచాయితీ నిధులతో నీటి తొట్టి నిర్మించడంతో పశువుల దాహం తీరేదన్నారు. కానీ ఇటీవల పంట కాల్వ నిర్మాణ పనుల్లో భాగంగా నీటి తొట్టిని కూల్చివేశారన్నారు. పశువుల దాహార్తిని దృష్టిలో ఉంచుకొని తొట్టిని మళ్లీ నిర్మించాలని కోరారు.

ఏచూరికి ఘన నివాళి

మెదక్ కలెక్టరేట్: కమ్యూనిస్ట్ యోధుడు ఏచూరి సీతారాం జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏచూరి చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాల కోసం మరిన్ని ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సంతోష్, సత్యం, రాణి, అమూల్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో బుధవారం ఉదయం 11 గంటలకు రైతులకు లీఫ్స్‌ఆధ్వర్యంలో 'సాగు న్యాయ యాత్ర 'లో భాగంగా భూ సమస్యల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ చారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అడ్వకేట్ సునీల్ రైతులకు భూ చట్టాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని వల్లూర్ జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో మేడ్చల్ డిపో బస్సును వెనక నుంచి కారు ఢీకొట్టింది. ఆర్టీసీ బస్సు రామాయంపేట నుంచి మేడ్చల్ వెళ్తుండగా సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. బస్సు అద్దాలు దెబ్బతినడంతో బస్ డ్రైవర్ హరీష్‌రావు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ రామకృష్ణగౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సృజన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): తూప్రాన్- నర్సాపూర్ రహదారిపై ఓ కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిద్దిపేటలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ యాదగిరికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. సంగారెడ్డి నుంచి సిద్దిపేటకు కారులో వెళ్తుండగా మగ్దుంపూర్ గ్రామ శివారులో కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదగిరి స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' యాత్ర


నిజాంపేటలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు 'హర్ ఘర్ తిరంగా' యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సుమారు 300 మీటర్ల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఉన్న ప్రజలు జాతీయత భావాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బీజేపీ, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీవ శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

నర్సాపూర్: అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి మండలాలకు చెందిన జీవ శాస్త్ర ఉపాధ్యాయులకు స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థవంతంగా, ఆలోచనాత్మకంగా బోధించాలని చెప్పారు. శ్వాసక్రియ, కిరణజన్యసంయోగ క్రియ, దృష్టి స్థిరత, కృష్టికోణం, మెదడు, అస్థిపంజరం, ఊపిరితిత్తుల నమూనాలను తక్కువ ఖర్చుతో బోధన సామాగ్రిని సమకూర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు తారాసింగ్, బుచ్చానాయక్, ప్రధానోపాధ్యాయులు విఠల్, ప్రతినిధులు శ్రీకాంత్, వెంకటేష్, దిగంబర్, సంగమేష్ పాల్గొన్నారు.

కరీం కుంట హద్దుల ఏర్పాటు


కరీం కుంట భూమిని సర్వే చేస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొంతన్‌పల్లిలో కబ్జాకు గురైన కరీం కుంట భూమిని రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది మంగళవారం జాయింట్ సర్వే చేశారు. కరీం కుంట భూమిని కబ్జా చేసి ఓ వెంచర్ నిర్వాహకులు రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయంపై గతంలో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు గతంలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే మంగళవారం ఇరిగేషన్ డీఈ బుచ్చిబాబు, సర్వేయర్ అరుణ్‌కుమార్, ఆర్‌ఐ కిషన్, ఇతర సిబ్బంది కరీం కుంట భూమిని సర్వే చేశారు. కొంతన్‌పల్లి గ్రామ పరిధిలో కరీం కుంటకు సర్వే నంబరు 741లో 3 ఎకరాల 27 గుంటల భూమి రికార్డు పరంగా ఉందని, సర్వే చేస్తే 30 గుంటల భూమి కబ్జాకు గురైనట్లు సర్వేయర్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఆక్రమణకు గురైన భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేసినట్లు డీఈ బుచ్చిబాబు తెలిపారు.

ఇందిరమ్మ ఇంటికి ఇసుక తరలిస్తే కేసులా!


తహసీల్దార్‌తో బాధితుడు, మాజీ సర్పంచ్

వెల్దుర్తి(తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నట్లు ప్రకటించగా.. అధికారులు కేసులతో వేధిస్తున్నారంటూ మండలంలోని బాగిర్తిపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సిద్ధి రాములు వాపోయాడు. వివరాల ప్రకారం.. ఐదు రోజుల క్రితం ఇంటి నిర్మాణం కోసం ధర్పల్లి శివారులో హల్దీవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న సమయంలో మెల్లూర్ సమీపంలో వెల్దుర్తి పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. దీంతో బాధితుడు రూ.5వేల డీడీతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా.. మరో రూ.15 వేలు డీడీ తీస్తేనే వాహనాన్ని రిలీజ్ చేస్తామని తహసీల్దార్ చెప్పారు. ఈ విషయంపై ధర్పల్లి మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి ప్రశ్నించగా.. కార్యాలయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. ధర్పల్లి శివారు నుంచి ఇసుకను తరలిస్తే వెల్దుర్తి పరిధిలో కేసు ఎలా నమోదు చేస్తారంటూ నిలదీశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్న తహసీల్దార్ వైఖరిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలేజీ ఆవరణలో వన మహోత్సవం


నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు

నర్సాపూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో మంగళవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాంచరణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల కార్యాచరణలో వెయ్యి మొక్కలు నాటినట్లు చెప్పారు. అనంతరం కమిషనర్‌తో పాటు మేనేజర్ మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది, కాలేజీ ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు మొక్కలు నాటారు.

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భవిష్యత్తు తరాలు బాటలు వేయాలని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కూచారం ఉన్నత పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

డీసీసీబీ మేనేజర్ అభినవ్

నర్సాపూర్‌రూరల్: బ్యాంకు ఖాతాలు, సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీసీబీ మేనేజర్ అభినవ్ తెలిపారు. మంగళవారం మండలంలోని నత్నాయపల్లి గ్రామంలో డీసీసీబీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలంతా పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై బీమాలు చేయించుకోవాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ మహిళా కానిస్టేబుల్‌కు ప్రశంసా పత్రం

మనోహరాబాద్(తూప్రాన్): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రిషెప్షన్ విభాగంలో ఉత్తమ పనితీరు కనబర్చిన తస్లీమాకు డీఎస్పీ నరేందర్‌గౌడ్ మంగళవారం ప్రశంసా పత్రం అందజేశారు.

◆ మండలాభివృద్ధికి కృషి చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల అభివృద్ధికి కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లేశం అన్నారు. ఈ మేరకు మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీఓ ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు శేఖర్ పాల్గొన్నారు.

◆ ధర్మ జాగరణ ఆధ్వర్యంలో రాఖీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని ఫైజాబాద్ ఉన్నత పాఠశాలలో ధర్మ జాగరణ ఆధ్వర్యంలో మంగళవారం రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ జాగరణ ఖండ ప్రముఖ్ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ పాఠశాలలో రాఖీ వేడుకలు నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యార్థినులు రాఖీ కట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తారాసింగ్ పాల్గొన్నారు.

◆ గిరిజన చట్టాలపై అవగాహన

నర్సాపూర్: ఆదివాసీల హక్కులు హరిస్తే చట్టరీత్యా నేరమని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సరీ్వస్ కమిటీ చైర్మన్ హేమలత చెప్పారు. మంగళవారం స్థానిక గిరిజన గురుకుల పాఠశాల కాలేజీ, ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గిరిజన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాలాజీ, న్యాయవాదులు రాజునాయక్, సాయికుమార్ పాల్గొన్నారు.

◆ 'పిచ్చి మొక్కలు తొలగించాలి'

నర్సాపూర్: స్థానిక మున్సిపాలిటీలోని 6వ వార్డులో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నామని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు పిచ్చి మొక్కలను తొలగించాలని మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

◆ గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని నవాబుపేట మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి(72) గుండెపోటుతో మంగళవారం మృతిచెందాడు. ఉదయం ఆయన అనారోగ్యానికి గురవ్వగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

◆ ఆరుగురు బైండోవర్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలో ఇటీవల పేకాట ఆడుతున్న పలువురిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ శ్రీనివాస్‌కు బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.గత వారంరోజుల క్రితం దాబాలో పేకాట ఆడుతున్న ఆరుగురు, సోమవారం పౌల్ట్రీ ఫామ్‌లో ఆడుతున్న ఆరుగురు నిందితులను మంగళవారం తహసీల్దార్‌కు బైండోవర్ చేశామన్నారు.

◆ మొక్కల పెంపకం అందరి బాధ్యత

పెద్దశంకరంపేట(మెదక్): మొక్కల పెంపకం అందరి బాధ్యత అని ఈజీఎస్ అధికారులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మల్కాపూర్‌లో గ్రామసభ నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రజలకు ఈజీఎస్ సిబ్బంది, టీఏలు మోహన్, స్వాతి, వినోద, స్వప్న, ఫీల్డ్‌అసిస్టెంట్లు రమేష్, నర్సింలు మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటరాములు పాల్గొన్నారు.

◆ యూరియా కొరత లేదు: ఏడీఏ

కౌడిపల్లి(నర్సాపూర్): యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని ఏడీఏ పుణ్యవతి సూచించారు. ఈ మేరకు మంగళవారం రైతువేదికలో ఏఓ స్వప్న, ఏఈఓలు సాహితి, స్రవంతి రైతులకు టోకెన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కౌడిపల్లి డివిజన్ పరిధిలో రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందన్నారు.

◆ రైతు సంక్షేమానికి కృషి

పాపన్నపేట(మెదక్): రైతు సంక్షేమానికి బీపీసీఎల్ కృషి చేస్తుందని సేల్స్ ఆఫీసర్ హరిగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు మేళా నిర్వహించారు. ఈ మేరకు కొత్తపల్లి సొసైటీ ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. వ్యవసాయ అధికారి నాగమాధురి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఫయాజొద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

◆ ఆకట్టుకున్న టీఎల్‌ఎం మేళా

హవేళీఘణాపూర్(మెదక్): మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయిలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రదర్శనలను ఎంఈవో మధుమోహన్ పర్యవేక్షించి ప్రతిభ కనబర్చిన వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. విద్యార్థులకు సులువుగా బోధన అర్థమయ్యేందుకు ఈ మేళా నిర్వహించినట్లు తెలిపారు.

◆ బీజేపీ నాయకుల అరెస్ట్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని బీజేపీ నాయకులను పోలీస్‌లు అరెస్ట్ చేశారు. మంగళవారం చలో జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి కుంకుమార్చనకు వెళ్లకుండా పోలీసులు మండలంలోని బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, శంకర్, శివకుమార్, శ్యామ్‌లను అరెస్ట్ అయ్యారు. అలాగే నార్సింగిలో జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, లింగారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు నర్సింహులు, లక్ష్మణ్‌లను అరెస్ట్ చేశారు.

◆ దాడికి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): దళితులను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని పాంబండలో సర్వేనెంబర్ 128లో బత్తుల వీరయ్య, దొడ్ల జశ్వంత్ దగ్గర 29 గుంటల భూమిని కొనుగోలు చేసి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వం నుంచి పలువురికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి, దీంతో ఆ స్థలంలో నిర్మాణాలు ప్రారంభించగా.. పలువురు అడ్డుకుంటున్నారన్నారు. కులం పేరుతో దూషించి దాడులకు పాల్పడ్డారన్నారు. మంగళవారం పీఎస్‌లో బాధితులు ఫిర్యాదు చేశామన్నారు.

◆ ప్రజా సమస్యలపై సీపీఎం ధర్నా

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కార్యాలయానికి వెళ్తే తహసీల్దార్ బాలలక్ష్మి తమపై దురుసుగా ప్రవర్తించారని సీపీఎం మండల కార్యదర్శి గౌరి ఆరోపించారు. ఈ మేరకు తహసీల్దార్ వైఖరి నిరసిస్తూ మంగళవారం కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు.